# అభివృద్ధిని చూసి ఓటేయండి

- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- జంగంరెడ్డిపల్లిలో ప్రచారం



జంగంరెడ్డిపల్లిలో చిన్నారి ఎత్తుకున్న మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, అక్టోబర్24: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రానికి రాగా, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జంగంరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటేయ్యాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఆచరణకు సాధ్యం కాని పథకాలను ప్రచారం చేస్తూ, ప్రజలను మోసంచేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ మోసాలతో కూడుకున్న పార్టీ అని.. అభివృద్ధి అంటే బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. గ్రామాలను అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే రాష్ట్రం మరోసారి అంధకారంలోకి వెళ్తుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి కర్ణాటక ప్రజలు ఆరు నెలలు గడవక ముందే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా ఉందని చెప్పారు. మీకు సేవచేసే అవకాశం మరోసారి కల్పించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీ నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ అన్నాడి అనంతరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, సర్పంచ్ తూంకుంట శ్రీలత, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, నేతలు శ్రీనివాస్, రాజశేఖర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, బాలరాజు, బాబు, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# బ్రహ్మాండం.. శ్రీవారి బ్రహ్మోత్సవం

- అశ్వవాహనంపై స్వామివారి దర్శనం
- భారీగా తరలివచ్చిన భక్తజనం



సిరిసిల్లలో అశ్వవాహనంపై విహరిస్తున్న శ్రీవారు, శోభాయాత్రలో పాల్గొన్న పట్టణ ప్రజలు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 24: సిరిసిల్లలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా సాగుతున్నాయి. మూడో రోజు సోమవారం ఆలయంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీలక్ష్మీపద్మావతి శ్రీ వేంకటేశ్వరస్వామి వివాహ వేడుకను ఉదయం 11 నుంచి మధ్యాహ్న ఒంటి గంటల వరకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 9గంటలకు హంస వాహనంపై శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుడు ఆలయ పురవీధుల్లో విహరించారు. కాగా, మంగళవారం ఉదయం 8గంటలకు హోమం నిర్వహించగా, 9గంటలకు సింహ వాహనంపై స్వామివారు విహరించారు. సాయంత్రం అశ్వవాహనం, రాత్రి 9గంటలకు గజ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. తర్వాత శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మానేరు తీరంలోని జమ్మిచెట్టు గద్దె వరకు స్వామివారు అశ్వ వాహనంపై విహారం చేయగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు.

# సీఎం కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు



సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తోట ఆగయ్య, చీటి నర్సింగరావు, గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల, అక్టోబర్ 24: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి పూల మొక్క అందజేసి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లాకు కేంద్ర సాయుధ బలగాలు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్
- బలగాలతో పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ కవాతు



జిల్లా కేంద్రంలో సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, అక్టోబర్ 24: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 200మంది కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు జిల్లాకు వచ్చాయని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో వంద మంది జిల్లా పోలీసు సిబ్బందితో కలిసి 200మంది కేంద్ర బలగాలతో ఏర్పాటు చేసిన ఫ్లాగ్‌మార్చ్ కవాతును ఎస్పీ ప్రారంభించారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, గోపాల్‌నగర్ చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలను శాంతిభద్రతల సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 200మంది బృందంతో కూడిన కేంద్ర బలగాలు వచ్చాయని, త్వరలో మరిన్ని వస్తాయని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టిసారిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 560పోలింగ్ స్టేషన్లు ఉండగా, అందులో 118 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. పాత నేరస్తులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బైండోవర్ చేస్తున్నామని, జిల్లా పరిధిలో ఐదు చెక్‌పోస్టులతో పాటు డైనామిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. సరైన పత్రాలు లేకుండా నగదు, వస్తువులను తీసుకెళ్తే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో బీఎస్ఎఫ్ అడిషనల్ కమాండెంట్, సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ ఉపేందర్, ఆర్ఐ యాదగిరి, ఎస్ఐలు, బీఎస్ఎఫ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఎడ్లబండ్ల ప్రదర్శన

జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు ▼



వేములవాడ టౌన్, అక్టోబర్ 24: దసరా సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేములవాడలోని మహాలక్ష్మి ఆలయం వద్ద గల జమ్మి చెట్టు వద్ద నుంచి సోమవారం పురవీధుల గుండా ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. సంస్కృతీసంప్రదాయాలకు అద్దం పట్టేవిధంగా ఎడ్ల బండ్ల ర్యాలీ నిర్వహించామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తెలిపారు. వేడుకల్లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుల్కం రాజు, ఎంపీపీ బండ మల్లేశం, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, ఇప్పపూల అజయ్, కందుల క్రాంతికుమార్, బింగి మహేశ్, జడల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మాదాడి గజానందరావు, అంజద్‌పాషా, నరాల దేవేందర్, అక్రమ్‌పాషా, తదితరులు ఉన్నారు.



ఎడ్ల బండ్లపై ర్యాలీగా మహాలక్ష్మి ఆలయం వద్ద గల జమ్మి చెట్టు వద్దకు వెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, నాయకులు

## మహాలక్ష్మి అలంకారంలో
# రాజరాజేశ్వరీదేవీ

వేములవాడ టౌన్, అక్టోబర్ 24: విజయదశమిని పురస్కరించుకొని సోమవారం వేములవాడ రాజన్న క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వీయుజ శుద్ధనవమి ఉపరిదశమి సందర్భంగా అర్చక సుహాసినులు అమ్మవారికి అభ్యంగనస్నానం చేయించారు. అనంతరం స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అద్దాల మండపంలో అష్టావధాని తిగుళ్ల శ్రీహరిశర్మతో దేవి భాగవత పురాణ ప్రవచనం, రాత్రి శ్రీ రాజరాజేశ్వరీదేవి, అమ్మవారికి, శ్రీ లలితా సహస్రనామ సహిత చతుష్షష్ట్యోపచార పూజ, కన్యక సువాసినీపూజ చేశారు. రాత్రి 9గంటలకు నిశీపూజ, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిశాయి.



మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

## ప్రగతిభవన్‌కు చేరిన
# పాదయాత్ర

- యువకుడికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కేటీఆర్

వీర్నపల్లి, అక్టోబర్24: బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావాలని వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన అజ్మీరా నవీన్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం ప్రగతి భవన్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను నవీన్ కలిసి పుష్పగుచ్ఛం అందించాడు. నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపిన అమాత్యుడు, తన కోసం సాహసాలు చేయవద్దని సూచించారు. పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్రంలో మూడోసారి సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని నవీన్‌కు తెలిపారు.



మంత్రి కేటీఆర్‌కు పూలమొక్క అందిస్తున్న నవీన్